# కలియుగంలో కవికుమారుడు

(కథానిక)

ఆమె నవ్వింది!

హృదయంలో దావాగ్ని "భుగభుగ" మండు తున్నప్పటికీ-ఆమె భారతీయస్త్రీ కనుక నవ్వింది.

అతడు కవి. ఆంధ్రసాహిత్య కళాతపస్వి! కవికి స్త్రీ నవ్వేటప్పుడు ఆమె కుందకుట్మల దంతాలు ఎలా ప్రకాశించాయో, కళ్లల్లో శత సహస్ర విద్యుత్తులు ఎలా ప్రసరించాయో, అధరోష్ఠాలు ఎలా తళుకులాడాయో, అవే కావాలి. ఒక్క మాటలో - కవికి బాహ్యసౌందర్యమే కావాలి. అతనికి అంతస్సౌందర్యం అవసరంలేదు. ఆకారమే లేనిదానికి సౌందర్యం ఎక్కడనుండి వస్తుంది?

అతడు ఆమెను నవ్విస్తున్నాడు కనుక ఆమె నవ్వుతోంది. ఊహూఁ. ఆమె నవ్వుతోంది కనుక అతడామెను నవ్విస్తున్నాడు.

నవ్విస్తున్నాడు కవ్విస్తున్నాడు. నవ్వుల్లో పువ్వులు. పువ్వుల్లో మస్పృణ మకరంద మాధుర్యం.

ఆమెను నవ్విస్తూ అతడు లోలోపల తన ప్రతాపానికీ, తెలివితేటలకూ, చలోక్తులు విసరడంలోని ప్రయోజకత్వానికీ గర్విస్తున్నాడు. పొంగిపోయి ఉబ్బి తబ్బిబ్బులు పడుతున్నాడు.

"నువ్వు నాదేవివి! నాఅజ్ఞాత అవ్యక్త బాధా మాధుర్యానివి!

"ఉపనిషత్సారాల ముద్దవు. హృదయేశ్వరీ! నీలిమబ్బుల స్వర్ణరేఖాంకితాంచలాలమాద నవరత్నపరిదీప్త కళాఘాతాలతో భావాశ్వాలను పరువులెత్తించే ప్రతిభావంతురాలివి! యుగయుగాలుగా, తరతరాలుగా పూలమాలలతో, ఆశాపాశాలతో, నాహృదయ కర్పూరఖండాల హారతులను అందుకొంటూన్న సాహిత్యమూర్తివి!"

ఆమె నవ్వుతోంది! హృదయంలో దావాగ్ని "భుగభుగ"మని మండుతూన్నప్పటికే-ఆమె భారతీయస్త్రీ కనుక నవ్వుతోంది.

ధన్! ధన్! ధన్! తలుపులుగ్రుద్దిన చప్పుడు.

"కవిగారూ!" తలుపులుగ్రుద్దిన వ్యక్తికంఠం. పురుషకంఠం! ఆ కంఠస్వరాన్ని ఆమె పోల్చుకుంది కాని, అతడు గుర్తించలేకపోయాడు. కవులకు స్త్రీలయొక్క "కలకంఠకులకంఠ కాకలీపాకలీ లాపహంబగు నెలుంగు" వినిపించునట్లు. బొంగురుపోయిన పురుషస్వరాలు వినిపించవు.

"ఏమయ్యోయ్, కవిగారూ! తలుపు తీయవయ్యా!"—కవికి యీఘోరణి కటువుగా వినిపించింది.

కవి హృదయేశ్వరివైపు ప్రశ్నార్థకంగా చూచాడు. హృదయేశ్వరి నేత్రాలు నిమీలించి కవిని చూచింది.

కవి యీపత్తు పందేహించినప్పటికీ-తన యింటి తలుపులను కాపాడుకోవలసిన బాధ్యత తనమీద వుంది కనుక వెళ్లి తలుపులు తెరచాడు.

బలిష్ఠుడైన ఒక యువకుడు యింటిలోకి ప్రవేశించాడు. అతని కళ్ళల్లోని ఎర్రజీరలు సాహిత్యదృష్ట్యా—"కన్గవకెంపు భాగ్యబంధుర సహజారుణత్వమే" అయినప్పటికీ కవి బాధపడ్డాడు. ఆ నడకకూడా అంత సౌమనస్యంగాలేదు. ఆ బలిష్ఠుడు దూకుడుగా అంబుమల్లే ఇంటిలోపలకు పోతున్నాడు.

ఆ చొరవకూ, ఆ జేవురించిన కళ్ళకూ, ఆ కండలుతిరిగిన దండలకూ కవి లొంగిపోయాడు. చెమర్చిన కళ్ళతో, ముచ్చెమటలుపోసిన శరీరంతో ఆవ్యక్తి వెనుకే తానూ వెళ్ళాడు ఇంటిలోకి.

ఆ వ్యక్తినిచూచిన హృదయేశ్వరి "గజగజ" వణికిపోతోంది. అతడు ఆగలేదు. ఆ దుర్మార్గుడు హృదయేశ్వరినిచూచి "రా!"అన్నాడు. బూతులు తిట్టాడు. తన సమక్షంలోనే తన హృదయేశ్వరికి జరుగుతోన్న అవమానం చూచి సహించలేకపోయాడు కవి! ఆ దుర్మార్గుడు తన హృదయేశ్వరి

వేముల వెంకటఅప్పారావు

చేయి పట్టుకున్నాడు. ఆమె యీసారి ఉగ్ర నరసింహావతారం ఎత్తింది! కాళీస్వరూపం దాల్చింది!

ఒక్క విసురుతో తనచేయి విడిపించుకుని—"తగ్గు! ముందుకు ఒక్క అడుగు వేశావో, నీరక్తం మడుగు కట్టిందన్నమాటే!" అని గర్జించింది. అలమారుదగ్గరకు చంగున లంఘించి తళతళ మెరుస్తోన్న ఒక చూరకత్తిని తీసింది. ఆ దుర్మార్గుడు ఒక అడుగు వెనక్కు వేశాడు.

ఈసారి కవికి ధైర్యం వచ్చింది. వృత్తంలో ఆరవఅక్షరం "త" కారంవుంచి పద్యం చెబితే-ఆపద్యం ఎవర్ని వుద్దేశించి చెప్పబడిందో ఆ వ్యక్తి "తారు"మని మరణిస్తాడుట. అంచేత మన కవికూడా ఆశువుగా "నీతల నుగ్గుసేతునుర! నీచుడ! కష్టనికృష్టదుష్టుడా!" అన్నాడు. కాని, మంత్రాలకు చింతకాయలు రాలలేదు. కవికి తన కవిత్వంమీదనే కోపం వచ్చింది!

"ఏమన్నావ్! నేను దుష్టుణ్ణా? నీచుణ్ణా? ఉండు. నీభరతం పడతా!" అంటూ ఆవ్యక్తి యీసారి కవిమీదకు తిరిగాడు. కవికి మానసిక బలం వున్నంతగా శరీరబలం వుంటుందా? అంచేత కవి గజగజలాడిపోయి, నిలుచున్నచోటనే కూలబడిపోయాడు. ఒక్కోసారి బుద్ధిబలం భుజబలం ముందు మోకరిస్తుంది.

"అయన్ను వదులు. ఊఁ! వెంటనే బయటకు నడు! ఆలస్యంచేశావో, యీ కత్తి కంఠంలో స్నానమాడిందన్నమాటే!" ఆమె మళ్ళీ గర్జించింది. కాని, ఆ దుర్మార్గుడు భయపడలేదు. "ఏమిటీ? ఆడముండకే యింత గోరోజనమా? సరే! కాస్కో!" అంటూ ఆమెమీదకు వెళ్లాడు.

ఆ దృశ్యం కవిలోని పురుషత్వానికే దెబ్బతీసేట్టుగావుంది, అందుచేత, కవిలేనిధైర్యాన్ని ఎరువుతెచ్చుకొని, లేచి, గదిమూలవున్న ఓ బడితె కర్రను సంగ్రహించి, నిశ్శబ్దంగా అడుగుల్లో అడుగులువేసుకుంటూ, వెనుకపాటుగావెళ్లి ఆ వ్యక్తి నెత్తిమీద ఒకదెబ్బ పెట్టుపెట్టాడు! "చంపేశారోయ్!"అని ఒక పొలికేక పెట్టి, మొదలు నరకబడ్డ చెట్టుమల్లే ఆ వ్యక్తి నేలమీదపడిపోయాడు. స్పృహ తప్పిందికాని నెత్తురుమాత్రం చిమ్మలేదు.

హృదయేశ్వరి కవిగారి ప్రతాపానికి సంతోషించిందా? ఊహూఁ! "అమ్మో!"అని కేకవేసి, కవిని 'చూరచూర'చూసింది. కవి యిప్పుడు రౌద్ర వీర, భీభత్స, భయానకరస ప్రవాహాల్లో, అలంకార శాస్త్రపు సుడిగుండాల్లో మునిగి తేలుతున్నాడు. "వీడ్ని బయటకు యీడ్చిపారేద్దాం." అన్నాడు. "ఛీ!"అంది ఆమె."చూడు. పాపం! ఎలా తల వాచిపోతుందో! నువ్వు మనిషివి కావూ? నీలో జాలిలేదూ? ఇంత పెద్ద దెబ్బకొట్టు కుంటారా, యెక్కడన్నా?"అంది.

"ఈ పశువుమీదనా జాలిచూపించేది? హుఁ! వాడ్ని యింకా ప్రాణాలతో వదిలిపెట్టినందుకు సంతోషించక!"అన్నాడు కవి. కవిలో ఆవేశం పుట్టుకొచ్చింది. శ్రీ శ్రీ జ్ఞప్తికి రాగా"సిందూరం రక్తచందన...బంధూకం...పులిచంపిన వేడి నెత్తురూ ..కలకత్తా కాళిన నాలుక!"అంటూ పరవళ్లు తొక్కుతున్నాడు.

"ఛీ!"అని ఆమె అసహ్యించుకుంది. కవి తనలోని ఆవేశాన్ని అణచుకోలేకపోయాడు. మనః ప్రశాంతికోసం బయటకుపోయి, అక్కడక్కడా తిరిగి, ఆఖరుకు ఓ కాఫీహోటల్ చేరుకున్నాడు.

హోటల్లో వున్నంతసేపూ అతనికి ముళ్ళమీద కూర్చున్నట్టనిపించింది. ఫలహారం"కారం"అనిపించింది, టీ-"ఛీ"అనిపించింది. అక్కడివ్యక్తులు రకారకాల వ్యక్తులు. వివిధ చర్చలు!...కొరియా యుద్ధం!...కాశ్మీర్ సమస్యాపరిష్కారం! యూ. యస్. ఏ. లో డాలర్‌నాధుల ప్రాబల్యం!... ఆంధ్రరాష్ట్రానికి (అప్పుడే దొరికిపోయినట్టే!) రాజధాని ఎక్కడవుంచితే బాగుంటుంది? బెజవాడా? విశాఖపట్టణమా?... నక్కపల్లిలో ఓ పిల్లికి కుక్కపిల్లలు పుట్టాయట! అలా చూస్తూండండి! ఇంకా ఎలాంటెలాంటి విచిత్రాలు పుడుతుంటాయో?... రాయలసీమలో మనుష్యులు చచ్చిపోయిన గొడ్లని తింటున్నారుట! ఛీ! ...ఎబ్బే! విశ్వనాథవారికీ కరుణశ్రీకి పోలికా?... కవిగారికి తలనొప్పిపడుతోంది. ఎందుకొచ్చిన సంభాషణలు? వీళ్ళంతా ఏదో తామే లోకాన్ని ఉద్ధరిస్తున్నట్టు!

కవి హోటల్‌లో ఎక్కువసేపు వుండలేకపోయాడు. పదణాలనర్రబిల్లుచదివించుకొని బయటపడ్డాడు. ఇంటికి త్రోవతీశాడు. ఏవేవో ఆలోచనలలో, బాధతో, సంతోషంతో, అనుమానంతో బరువెక్కిపోయిన గుండెను అరచేత్తో

పుచ్చుకొని నడకసాగించాడు——కాని, ఆ త్రోవ తన యింటికికాదే? పరధ్యానంగా నడచిన కవి పార్కులో అడుగుపెట్టాడు.

"ఇదేమిటి, యిలావచ్చానేం?"అనుకున్నాడు "ఇంటికి బయలుదేరిన నేను పార్కులోకి ఎలా వచ్చాను? నేను నిద్రపోతున్నానా? అసలు, నిద్రపోతూ నడవడం సాధ్యమా? మరి, జాగ్రదవస్థలోనే వున్నట్టయితే, అనుకున్న చోటుకు పోకుండా వేరొకచోటుకు ఎలారాగలిగాను?"

రేడియోలో ఎవరో కవి స్వీయకావ్యపఠనం చేస్తున్నాడు. లోకాన్ని ఉద్ధరిస్తున్నాడు!

తానుమాత్రం కవికాడూ? ఆ మాటకువస్తే, తనలోవున్న ఉపజ్ఞా, రసహృదయమూ, భాషాపాటవమూ, భావోద్వేగమూ — యీనాటి కవులలో యెంతమందికి వుంది? ఉహూఁ! లోకం ఇంతటి దురవస్థకు పాల్బడిందేం? పుత్తడిని వదిలి యిత్తడిని కోరుకుంటోంది. ఉష్! దుస్సహం!

ఏదో-తనకే తెలియని ఆవేదనతో బరువెక్కిన గుండెతో కవి తనయింటికి చేరుకున్నాడు. ఇంటి తలుపులు బారుగా తెరుచుకొనివున్నయ్. కవికి కోపం తలమున్కలుగావచ్చేసింది.

"ప్రళయావసాన వర్షత్పుష్కలావర్త ముక్తాశనిధ్వనుల్ మునరు"పట్టుకొన్నట్టు "హృదయేశ్వరీ! హృదయేశ్వరీ!"అని గర్జించాడు. ఇంటిలోనికివెళ్లి నాల్గుమూలలా చూచాడు. లోపల ఎక్కడిసామాను అక్కడనే చిందరవందరగాపడి వుంది. పెట్టెలన్నీ తెరచివున్నయ్. పూజగదీ, వంటగదీ, స్నానాలగదీ, పడకగదీ, వసారా, దొడ్డీ——అన్నీ వెతికాడు. లేదు! కవికి హృదయేశ్వరి కనుపించలేదు.

అంతే! కవిగుండె బ్రద్దలయింది. కవి కన్నీరు కార్చాడు. భోరుమని యేడ్చాడు. "హృదయేశ్వరీ! హృదయేశ్వరీ!"అని అతని నోటవెలువడిన ఆక్రందనాలు దిగ్దిగంతాలలో ప్రతిధ్వనించాయి.

కవికి పిచ్చెక్కింది. మనస్సు ముక్కలయింది. ఇల్లూవాకిలీ, ఆస్థిపాస్థులూ అన్నీ వదలిపెట్టి, తన హృదయేశ్వరికోసం మూడులోకాలూ గాలించాడు! కనిపించిన ప్రతివ్యక్తినీ, పశువులనూ, రాళ్ళనూ, రప్పలనూ"హృదయేశ్వరి ఏదీ? చెప్పు! ఎక్కడదాచావోచెప్పు! నిన్నుచంపుతా!" అనేవాడు. పిచ్చిలో కవికి ఆశువోరణిఎక్కువయింది. నడచినా, కూర్చున్నా ఏడుస్తున్నా—ఏం చేసినా కవిత్వమే!

కవికి తిండిలేదు! కవి వంటిమీద మాసిపోయిన బట్టల పీలికలు! కవికి యిల్లు లేదు!

ఒక నెలరోజుల్లో కవి మారిపోయాడు. గడ్డం పెరిగిపోయింది. తల జడలుకట్టింది. అతడు మూగవాడైపోయాడు. ఆ కవిత్వంలేదు. ఆ కన్నీరు లేదు. ఆ హృదయేశ్వరీ స్మరణలేదు. అతడిప్పుడు అమనస్కుడు!

ఒకనాటి సాయంత్రం——

సముద్రపు ఒడ్డున కూర్చున్నాడుకవి. పాపం! అక్కడైనా అతని మనస్సుకు ప్రశాంతత చిక్కలేదు. అక్కడకూడా చర్చలే. నవ్వులు. తమాషాలు. ప్రణయం. నిట్టూర్పులు. చిరాకులు. పరాకులు! ఛీ! ఛీ! ఛీ! హే, భగవాన్! ఇంకెక్కడి ప్రశాంతత?

సిల్కు సూటులో అందంగా, సన్నగా, నాజూకుగాకనిపిస్తోన్న ఒక యువకుడు, తన అర్ధాంగితో చేతుల్లో చేతులుకలిపి షికారుకు వచ్చాడు సాగర తీరానికి. వచ్చి అక్కడ వంటరిగా కూర్చున్న కవియొక్క వేషాన్ని చూచి ఎవడో ముష్టివాడనుకొని, దయతో తన ప్లాస్టిక్ పర్సు విప్పి, కవిముందు ఓ అణా విసిరాడు.

కవి హృదయం భావోద్వేగంతో ఊగులాడిపోయింది. భావం ఛందస్సునాశ్రయించింది:

"ఒక అణాకాసుతో విరహోగ్రవహ్ని
కీలికా మాలికలలోన కాలుచున్న
నామనస్సు ప్రశాంతించునా? మదీయ
ప్రేమనిధి నాకు చేజిక్కునా?మహాత్మ!"
——అన్నాడు.

ఆ దంపతులు ఎలక్ట్రిక్ షాక్ తిన్నట్లు నిర్విణ్ణులై పోయారు."మీరు కవులా?" కవి మాట్లాడలేదు. "మీదేవూరు? మీ పేరేమిటి?" ఉహుఁ! ఆ మంకుతనమే.

మసకమసక చీకట్లు కాటుక ధూళిమల్లే లోకాన్ని ఆక్రమిస్తున్నవి. ఒక్కరొక్కరుగా అందరూ ఎవరి కొంపలకు వారు చేరుకుంటున్నారు. ఈ రాకపోకల సమస్య యీనాటిదా? అరిస్టోటిల్ దగ్గరనుండి, శ్రీ అరవింద వరకూ అందరూ ఈ సమస్య గురించి బుర్రలు పాడుచేసుకున్న వారే!

"మా యింటికి వస్తారా?" దంపతులడిగారు. "ఇదేమిటీ గొడవ? వీళ్లెవరు? నే నెవణ్ని? వీళ్లకు నామీద యింత అభిమానం దేనికో?" అనుకున్నాడు కవి స్వగతంగా. పైకి మాత్రం "వస్తా" అనికాని, "రాను" అనికాని చెప్పలేదు. మౌనంగా వాళ్ళను అనుసరించాడు. ఇంత పిచ్చివ్యక్తిలో అంత గొప్ప కవిత ఎలా యిమిడివుందో తెలియక ఆ దంపతులు ఆశ్చర్యపోతున్నారు.

అది కోడంబాకంలో ఒక దివ్య భవనం. ఆ యువకుడు ఒక కులీనుడు. విద్యాధికుడు "సెక్రటేరియట్"లో ఏదో పెద్ద పదవిలోనే ఉంటున్నాడు. అంత పెద్ద భవనంలోనూ ఆ యిద్దరు దంపతులు మాత్రమే వుంటున్నారు. నౌకర్లూ చాకర్లూ వున్నారనుకోండి! అదివేరే విషయం.

ఆ యువకుడు కవికి క్షురకర్మ చేయించాడు. మంచినీళ్ళతో స్నానం చేయించాడు. మంచి బట్టలు కట్టాడు. మంచి కబుర్లు చెప్పాడు. మంచి భోజనం పెట్టాడు. కాని, కవిలోని ఆ అజ్ఞాత అవ్యక్తబాధ బాధగానే వుండిపోయింది. ఉండి ఉండి ఆ కవి ఒక్కసారిమాత్రం పలవరించాడు: "హృదయేశ్వరీ హృదయేశ్వరీ!" అని. ఇంకేం? కథ తెలిసిపోయింది ఆ దంపతులకు! పాపం! ఇతడెవరో మహాకవి! ప్రేమకోసం పిచ్చివాడై పోయాడు. భరింపరాని సంఘటన ఏదో యితని జీవితంలో తటస్థించింది. లోకం చీకటైపోయింది!

పరధ్యానంతో దిక్కులు చూస్తూన్న కవికి ఒక గదిగోడమీద ఒక ఫోటో కనిపించింది. ఆవేశంతో "హృదయేశ్వరీ!హృదయేశ్వరీ" అని అతడు వాపోయాడు. ఆ విషయం ఆ యువకుని కంట పడ్డది. వెంటనే అతడు ఆ ఫోటోతీసి, చేతి రుమాలుతో ధూళిదులిపి, కవికి అందించాడు. కవి ఉద్రేకంతో ఆ ఫోటోను ముద్దాడాడు. గుండెకు హత్తుకున్నాడు. కవోష్ణ బాష్పధారల్తో అభిషేక మిచ్చాడు.

కవియొక్క యీ చేష్టల్ని చూచిన యువకునికి కోపం వచ్చింది. కాని విద్యావంతుడు కావడంచేతనూ, కొంత ప్రేమతత్వాన్ని గ్రహించిన వాడు కావడంచేతనూ, శాంతించాడు.

"మీరు యీ ఫోటోలోని అమ్మాయిని ఎప్పుడైనా చూచారా?" యువకుడు ప్రశ్నించాడు.

"నా హృదయేశ్వరి!" కవి కలవరించినట్టు జవాబిచ్చాడు.

"నా చెల్లెలు."

కవి ఆశ్చర్యపోయాడు. అకస్మాత్తుగా అతని ముఖం శతకోటి భానుతేజంతో కలకల లాడిపోయింది.

"అవును! నా చెల్లెలే. అలా అనడానికి సిగ్గవుతోంది! కాని అలా అనకతప్పదు!"

"నిజమా? నిజానికి యీ ప్రపంచం యెంత చిన్నది!" కవి కవిత్వపరిభాషలోనే మాట్లాడాడు

"నిజమే! ఆమెను యీవూళ్ళోనే ఒక షావుకారుగారి ఏకైకపుత్రుడికి యిచ్చాం. అతడు చదువుకున్నవాడే. బలశాలే. కాని, ఏంలాభం? దుర్మార్గుడు. పశువు. త్రాగుడూ, వ్యభిచారమూ ఒకటేమిటి? ప్రపంచంలో మనిషి ఎన్ని విధాల చెడతాడో, అన్నీ ఆతనిలో వున్నయ్. అతడు మా చెల్లెల్ని పెట్టేబాధలు నేను వర్ణించలేను. ఒక దెబ్బకాదు, ఒకతన్ను కాదు—అంత దారుణహింస పశువుకూడా సహించలేదు. ఒకసారి ఒక నీళ్ళ చెంబుతో ఆమెతల బ్రద్దలుకొట్టాడు. ఇలాఎన్ని విధాలో బాధించేవాడు. ఒకటిరెండుసార్లు నేను అతన్ని బ్రతిమాలాను. "నాయిష్టం. నాపెళ్లాన్ని నేనేమైనాచేసుకుంటా. నువ్వెవడవు నన్ను కాదనడానికి?" అన్నాడు.

"అప్పటినుండి నేను అతని యింటికే వెళ్లడం మానుకున్నాను."

"స్త్రీ కూడా మనిషే! ఆమెలోకూడా 'మనస్సు' అనే పదార్థంవుంది. దారుణమైన ఆ బాధల్ని ఆమె సహించలేకపోయింది. ఒక యువకుణ్ణి వలచింది. అతనితో——ఇంకా అతను వాక్యాన్ని ముగించనేలేదు. కవి అందుకున్నాడు- "నేనే!"

"ఆ!" ఆ యువకుడు ఆశ్చర్యపోయాడు. అతని కళ్లు తడిసిపోయాయి. "అయితే, మీతో ఆ విషయమై ఎక్కువగా ప్రస్తావించవలసిన అవసరం లేదనుకుంటాను. మీదగ్గరనుండి ఆమెను బలవంతంగా తీసుకుపోయినతర్వాత అతడు ఆమెను మరింత కసితో బాధించ సాగాడు. ఆ హింసాకాండకు ఆమె భరించలేకపోయింది. ప్రపంచం అంతా ఒక విషవృక్షంలా కనిపించింది. విష

వృక్షాన్ని ఆశ్రయించుకొనివున్న పక్షులు ఎంత కాలమని బ్రతకగలవు? ఆమెను నిస్సహాయ స్థితిలో నేను వుండికూడా లేనట్టే అయ్యాను.

ఆఖరుసారిగా అతన్ని ప్రార్థించాను. "పోనీ! నీకిష్టంలేకపోతే నా యింటికి పంపు. నాకూ భగవంతుడేదో ఇంత ఆధారం చూపేవున్నాడు. నా చెల్లెలు నాకు బరువా ఏమిటి?" అని వేడుకున్నాను. అతడు అందుకు ఒప్పుకోలేదు. పైపెచ్చు నన్ను కొట్టవచ్చాడు. నేనూ చిన్నప్పటినుంచీ వ్యాయామం చేసివున్నవాణ్ణే. తలుచుకొంటే వాడెంత? బోయవాడు పక్షిపిల్ల గొంతుక పిసికినట్లు పిసకగలను. కాని, మా చెల్లెలిముఖం చూచి వూరుకున్నాను" ఆ యువకుడు ఆగాడు.

"అవును. వాడు దుష్టుడే! కండలు తిరిగిన దండలు" అన్నాడు కవి.

"మీరతన్ని చూచారా?" యువకుడు అడిగాడు. 'ఔను' అన్నట్టుగా కవి తల ఊపాడు.

"ఆమె పోయింది. శాశ్వతంగా నిద్రపోయింది. నేటికి సరిగ్గా ఒక నెల అయింది" అన్నాడు యువకుడు బొంగురుపోయిన కంఠంతో.

"హృదయేశ్వరీ!" అని కవి చేసిన ఆక్రందన ధ్వని దిక్కులకొసల దాకా మారుమ్రోగింది.

కథానిక

# కొత్త చిగుళ్లు

"శ్రీవిరించి"

ఉయ్యాల వూగుతోంది. కుర్రవాడు యేడుస్తున్నాడు. తల్లి సముదాయించటానికి ప్రయత్నించి ప్రయత్నించి చివరకు విసుగెత్తి యేమీ తోచక దిగాలుపడి కూర్చుంది. ఇంతకూ వాడామొండి యేడుపు యెందుకు లంకించుకున్నట్టు? ఎంతో పెద్దసమస్యయినా తీవ్రంగా కూర్చుని ఆలోచిస్తే మేధస్సుకు సమాధానం దొరకకపోదు. కాని ప్రస్తుతం ఆమెపరిస్థితి అగమ్యగోచరంగా వుంది. రోజూ అలవాటు ప్రకారమే యీనాడూ గోరువెచ్చని నీరుపోసి స్నానం చేయించింది. తుడిచి లాలించి కడుపార పాలిచ్చి ఊయలలో పడుకోబెట్టింది. అకస్మాత్తుగా వాడు ఏడుపు అందుకున్నాడు. ఊపింది, జోకొట్టింది, లాలిపాటలు పాడింది, ఎన్నోవిధాల నిద్ర పొమ్మని సజావుగా చెప్పిచూచింది. కాని లాభం మాత్రంలేదు. వాడు యేడుపు యిప్పట్లో ఆపేట్టు లేడు.

తల్లి యేం చేస్తుంది? ఎత్తుకొని తిప్పినా యేడుపు తగ్గలేదు. ఎందుకు వాడికాకష్టం? ఎందువల్ల ఆ దుఃఖం?

తల్లికీ యేడుపు వచ్చింది. కాని తనుకూడా యేడిస్తే కుర్రవాడు మరీ బేజారెత్తిపోతాడని వూరుకుంది. తరుణోపాయం దొరకటంలేదు. ఏమిటి దారి?

వాడికి నిద్రరావటం లేదు గావును, అయితే ఆడుకోరాదా? తీరి కూర్చుని యీ యేడుపు దేనికి?—ఒకక్షణం కోపంవచ్చింది. కాని తన కోపకారణం యేమిటో తెలీక మళ్ళీ తగ్గింది. వేలెడులేనిపసికందు మీదనా తనకోపం? వాడికేం కష్టం కలిగి యేడుస్తున్నాడో మరి!

యేమికష్టం కలిగింది? తనకు తెలీదా? తెలుసుకుని కష్టం తొలిగించాల్సిన బాధ్యత తనది.

అరగంటసేపు నిర్విరామంగా యేడ్చి అలసటపొందాడు వాడు. ఎక్కడ హైరాణ వచ్చి పడుతుందో స్పృహతప్పిపోతాడో అని తల్లి భయం. కాని ఆలోచన పారదు. చివరకు కుర్రాడు యేడవటం చేతగాక ఆపేశాడు. తల్లికి చాలా సంతోషం కలిగింది. అయితే యెందుకు యేడ్చినట్టు, యెందుకు మానినట్టు అని అర్థం కాలేదు. పోనీలే యేడుపుమానాడంతేచాలు అని వూరుకుంది.

కుర్రవాడు నిద్రపోతున్నాడు. తండ్రి యింటికి వచ్చాడు. అడుగులు ధబీమని చప్పుడవుతున్నాయి. తల్లి యెదురువచ్చి "గట్టిగా